**International Journal of Academic Research**
**ISSN: 2348-7666 : Vol.2, Issue-4(7), October-December, 2015**
**Impact Factor: 3.075: email:** drtvramana@yahoo.co.in

# డా॥ ఉమర్ ఆలీసా (1885-1945)

Ch.Padmavathi, Head of the Dept. History, Ideal Degree College of Arts and Sciences, Indrapalem, Kakinada, AP

ఆంధ్రదేశానికి నవ్యతని, నవజీవనాన్ని ప్రసాదించిన సాంస్కృతిక పునరుజ్జీవన వికాసం గోదావరి జిల్లాల నుండి ప్రసరించినదని చరిత్రకారుల అభిప్రాయము ఆధునిక ఆంధ్రదేశానికి తూర్పు గోదావరి జిల్లా ముఖ్య కేంద్రం తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురానికి, చారిత్రక నేపధ్యం ఎంతైనా ఉంది.

ఇంతకీ ప్రాంతీయ, లేదా స్థానిక చరిత్రలెందుకు? అవి ఏ ప్రయోజనాల్ని సాధిస్తాయి. బృహత్ చరిత్రలో ఇవి అంతర్భాగాలు, ఒక జాతి లేదా దేశ సమగ్ర చరిత్ర నిర్మాణానికి, ఇవి దోహదం చేస్తాయి. మరీ ముఖ్యంగా భారతీయ సంస్కృతి సంకీర్ణంతో కూడుకున్న విలక్షణ సంస్కృతి, ఎన్నోమతాలు, కులాలు, ఉపకులాలు, జాతులు, భాషలు, లిపిలేని వందలాది మండలికాలున్నాయి. భిన్నత్వంతో తొణికి సలాడే సంస్కృతి మనది. ఇటువంటి భిన్నత్వ సంస్కృతికి ప్రతీకగా ఆవిర్భవించిన “శ్రీ విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠము” సమాజానికి అందిస్తున్న సేవలు ప్రసంనీయమైనవి. ఈ శ్రీ విశ్వవిజ్ఞాన్ విద్యా, ఆధ్యాత్మిక పీఠానికి 6వ అధిపతి డా॥ ఉమర్ ఆలీషా గారు.

**ఉమర్ ఆలీషా పూర్వీకుల చరిత్ర :**

శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠము ఆదిలో అరబ్బుదేశంలోను తరువాత బగ్దాద్ నుండి పారశీక దేశము అక్కడినుండి 1472 సం॥లో భారతదేశమునకు వచ్చి ఢిల్లీ నగరములో 6 తరాల వరకు నివశించి ఉన్నది. మొగల్ చక్రవర్తి బాబరుకాలంలోనే ఈ పీఠాధిపతి భారతదేశమునకు వచ్చారు. బాబరు చక్రవర్తి మొదలు ఔరంగజేబు చక్రవర్తి వరకు ఆరు తరాల మొగలాయి చక్రవర్తులు భారతదేశాన్ని పరిపాలించేకాలంలో ఈ పీఠాధిపతులు కూడా మొగలాయి చక్రవర్తులతో పాటు ఢిల్లీలో నివశించారు. షాజహాన్ చక్రవర్తి జ్యేష్ట పుత్రుడు దారాఘుఖోవ్ సూఫీ వేదాంతి, ఔరంగజేబు కుమార్తె జేబున్నీసా కూడా సూఫీ తత్త్వాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. దీనిని బట్టి మొగల్ చక్రవర్తులకు ఈ పీఠాధిపతులు గురువులై ఆశీర్వదించినట్లు తెలుస్తుంది. అందుచేత మొగల్ చక్రవర్తులు ఈ పీఠాధిచార్యుల శిష్యులు కాకపోతే దారాషుఖోవ్ సూఫీ వేదాంతి అయి ఉండేవాడు కాదు అని ఈ పీఠం యొక్క సప్తమ పీఠాధిపతి శ్రీ హుస్సేన్ షా గురువర్యులు చెప్పినారు. ఔరంగజేబు తన మత మౌఢ్యంతో ఈ పీఠాధిపతులతో సమకాలీకుడైన సర్మద్ హుస్సేన్ పేరుగల తత్త్వ వేత్తను చంపించడంతో ఈ పీఠాధిపతి ఢిల్లీని వదలి తానిషాకాలంలో హైదరాబాద్ వచ్చినారు. హైదరాబాద్ నవాబు అయిన తానీషా శ్రీ విశ్వవిజ్ఞా విద్యా ఆధ్యాత్మిక పీఠానికి 2 జాగీర్లిచ్చినారు (1) తుని జాగీరు, (2) కొట్టం జాగీరు అందుచేత ఈ పీఠాధిచార్యులు హైదరాబాద్ విడిచి పిఠాపురంలో ఈ పీఠాన్ని స్థాపించి స్థిర నివాసం చేసుకున్నారు. 533 సం॥లకు పూర్వం భారతదేశానికి వచ్చిన ఈ పీఠం నేటికి పిఠాపురంలో ఈ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అనే పేరుతో విలసిల్లుతున్నది.

హైదరాబాద్‌ని విడిచి పెట్టిన తరువాత పిఠాపురం వచ్చిన మొదటి పీఠాధిపతి శ్రీ మదీన్‌కబీర్షాగారు. ఈయన తరువాత వారి అగ్రనందనుడు ద్వితీయ పీఠాధిపతి మధార్షా., మధార్షా గారి తరువాత వారి జ్యేష్ట కుమారుడు తృతీయ పీఠాధిపతి "హుసన్మియాషా" వారి కుమారులు చతుర్థ పీఠాధిపతి కహెనేషావలి. కహెనేషావలి వారి అగ్రనందనుడు పంచమ పీఠాధిపతి మహర్షి మొహియద్దీన్ బాద్షా. ఈ పంచమ పీఠాధిపతి మహర్షి జ్యేష్ఠ కుమారుడు శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి.

**ఉమర్ ఆలీషా గారి గురించి ముందుమాట :**

ఇప్పటి పిఠాపురం శ్రీ విశ్వవిజ్ఞాన్ విద్యా, ఆధ్యాత్మిక పీఠానికి 6వ పీఠాధిపతి డా॥ ఉమర్ ఆలీషా. ఎవరికైనా, ఎంత గొప్పవాడైనా ఏదో ఒక రంగంలో ప్రావీణ్యం ఉంటుంది కాని పూర్వపు ఉమరాలీషా గారి ఏ ఒకరంగంలోనే ప్రసిద్ధులు కారు. ఆయన మహాపండితుడు. కవీంద్రుడు, గొప్ప మేధావి. బహుగ్రంథకర్త, మహావక్త, అన్నిటికి మించి స్వాతంత్ర్య సమరయోధుడు. కేంద్ర శాసన సభ సభ్యుడు.

ఆ మహనీయుని వ్యక్తిత్వం అరుదైనది. ఆయన తెలుగు భాషకు చేసిన సేవ విశిష్టమైనది. ముస్లిం పండితులలోనే కాదు ఏ పండితులలోనైన తెలుగు తీయదనాన్ని రుచి చూపించిన కవీంద్రులు ఎందరో ఉండరు. ఉమర్ ఆలీషా సంస్కృతము, పారిశీకం, తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలను అధ్యయనం చేసారు. ప్రాచీన ప్రబంధాలను పురాణేతిహాసాలను అవుపోసన పట్టారు.

డా॥ ఉమర్ ఆలీషా గొప్ప రచయితయే కాక మహావక్త. అన్ని అంశాల మీద అలవోకగా ప్రసంగాలు చేయడంలో ఆయనదిట్ట. చిన్నతనము నుండే కలము, గళంతో తనదైన ప్రతిభను కనపరచిన ఆయన అత్యున్నత సాహిత్యాన్ని సృష్టించారు. అద్భుత ప్రసంగాలు చేసారు. ఆయన రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగాలు అసంఖ్యాకంగా ఉన్నాయి.

డా॥ ఉమర్ ఆలీషా వ్యాసాలు ఉపన్యాసాలు అనే గ్రంథంలో 80 ఏళ్ళ క్రితం ఆయన వ్రాసిన వ్యాసాలున్నాయి. సమాజనమును పట్టి పీడిస్తున్న రుగ్మతలను రూపుమాపేందుకు గళమెత్తి చేసిన ప్రసంగాలూ ఉన్నాయి. కవిత్వానికి అద్భుత స్థానాన్ని కల్పించిన ఉమర్ ఆలీషా ఈ గ్రంథములో మొదటి వ్యాసము "కవిత్వము"లో కవిత్వాన్ని నిర్వచిస్తూ కవిత్వ రసావేసము, ప్రేమమయ స్వరూపమైన ఒక అపురూప సత్పదార్థము. ఇది విరుద్ధమని నిర్వచించుటకు అవకాశములేని ప్రణవాత్మకమైన జ్యోతి అని ప్రకటించారు. ఈ కోణమునుండే "కావ్య స్వరూపము" అను వ్యాసములో కావ్య స్వరూప విమర్శనమున్న అనన్య సామాన్యము, అతీంద్రియము, భావాతీతము అని విస్పష్టీకరణ చేయుటలో ఉమర్ ఆలీషా భావ గాంభీర్యత వ్యక్తమగుచున్నది.

స్పష్టమైన మార్గమును నిర్దేశించుకున్న ఉమర్ ఆలీషా పొగడ్తకు పొంగిపోలేదు. ఎత్తుగడకు తూలిపోలేదు. ఆయన చెప్పదలచుకున్న విషయములను ఖచ్చితంగా చెప్పడంలో నేర్పరి. మానవ సృష్టియైన అస్పృశ్యతపైన

ఆయన ధ్వజమెత్తిన తీరు ప్రసంశనీయమైనది. అన్ని రకాల వివక్షతలను రూపు మాపేందుకు సంకల్పబద్ధులైన ఉమర్ ఆలీషా ఆది రాజకీయమైన సాంఘిక సంస్కరణమైన, ఆధ్యాత్మిక ప్రబోధమైన సాహితీ వ్యవసాయమైన ఉపేక్షించలేదు. ఆయన రాసిన గ్రంథంలో ఈ దృక్పథము స్పష్టమగుటయే కాక, ఆయన ప్రసంగాలలో కూడా విస్పష్టమగుచున్నది.

**ఉమర్ ఆలీషా జీవిత విశేషములు :**

విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్మాత్మిక పీఠము ఐదవ పీఠాధిపతి మహర్షి మొహియుద్దీన్ బాద్షా, ఈయన మొదటి కుమారుడు ఉమర్ ఆలీషా, ఉమర్ ఆలీషా 1885 ఫిబ్రవరి 28న పిఠాపురంలో జన్మించినారు. ఆయన తల్లి పేరు చాంద్‌బీబి. సాహిత్య సారస్వత ధార్మిక సేవా కార్యక్రమాల నడుమ జన్మించిన ఉమర్ ఆలీషా తమ పూర్వీకుల శక్తి సామర్థ్యాలను, జ్ఞాన పాఠవాలను చిన్ననాటనే సంతరించుకున్నారు. 8వ ఏటనే ఆశువుగా కవ్తివం చెప్పి పండితుల మెప్పు పొందారు. పిఠాపురం ఉన్నత పాఠశాలలో విధ్యాభ్యాసం చేసిన తరువాత ఉమర్ ఆలీషా, ప్రముఖ సంస్కృతాంధ్ర భాషా పండతుల వద్ద శిష్యరికం చేసారు. తండ్రి వెంట ఉంటూ అరబ్బీ, పరిష్యన్, ఉర్దూ భాషలను నేర్చుకున్నారు. స్వగృహంలో ఏర్పాటు చేసిన పండిత ప్రముఖుల సహాయంతో ఆంగ్ల, హిందీ, ఫ్రెంచి భాషల మీద పట్టు సంపాదించారు. చిన్నతనంలో పలుభాషల్లో పరిచయం సంపాదించిన ఉమర్ ఆలీషా 14 సం॥ల వయస్సులో చందోబద్ధంగా చక్కని తెలుగులో పద్యాలు రాయడం ధారాళంగా కవిత్వం చెప్పడం ప్రారంభించారు. ఆయన తన వంశ గురువైన శ్రీ అఖైలాలీషాను స్తుతిస్తూ "బ్రహ్మ విద్యా విలాసం" అను శతకాన్ని రచించి ఆయన గురువుకు సమర్పించారు. ఆధ్యాత్మిక, లౌకిక విషయాలను సామాన్య జనావళికి అర్థమయ్యేరీతిలో చేసిన ఉపన్యాసాలు, కవిత్వాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రత్యేక కారణాల వల్ల ఆనతికాలంలోనే ఆయన ప్రజల చేత కవిగారనిపించుకున్నారు. ఈ ప్రజావాక్కు నిజం చేస్తూ ముస్లిం కవిగా విశేష ఖ్యాతిని గడించాడు.

ఉమర్ ఆలీషా పూర్వీకులు స్థాపించిన శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం నియమాల ప్రకారం అగ్రనందుడు పీఠాధిపతి స్థానాన్ని స్వీకరించడానికి అర్హుడు. ఈ సాంప్రదాయం ప్రకారం ఉమర్ ఆలీషా తన తండ్రి 1928 సం॥లో కన్నుమూయటంతో ఆధ్యాత్మిక పీఠాధిపతి అయినారు. ఉమర్ ఆలీషా విద్యాభ్యాసం ఉన్నత పాఠశాలతో ముగిసింది. ఆ తరువాత డిగ్రీ చదువుపై దృష్టి సారించలేదు. తన తండ్రిని ప్రధాన గురువుగా స్వీకరించి ఆనాటి పండితులు రచించిన అపార సాహిత్య సంపద ఆయనకు ఉపాధ్యాయ మార్గమైనది. బహుభాషా పండితుడైన ఆలీషా ప్రపంచ భాషలలో ఆధ్యాత్మిక సాహితీ గ్రంధాలను అధ్యయనం చేసారు. అటు సాహిత్య ప్రక్రియల మీద గట్టిపట్టు సంపాదించారు.

డిగ్రీ సర్టిఫికేటు అవసరం లేకుండా విద్వత్తును ప్రధాన అర్హతగా పరిగణించి ఉన్నత ఉద్యోగాలకు ఆహ్వానించే చక్కని వాతావరణం ఆనాటిది. పండితుడుగా ప్రసిద్ధి చెందిన ఉమర్ ఆలీషాకు చాలా ఆహ్వానాలందాయి.

ధనార్జన మీద ఆశక్తిలేని ఉమర్ ఆలీషా ఆ ఆహ్వానాలను తిరస్కరించి భాషా సేవ, సారస్వత సేవ, వేదాంత సేవలో గడపాలని, సమాజసేవ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ దశలోనే ఉమర్ ఆలీషా అపూర్వమైన సారస్వత సంపదను సృష్టించారు. సుమారుగా 50 పుస్తకాలు రాశారు.

**ఉమర్ ఆలీషా సాహిత్య రచనలు :**

ఉమర్ఆలీషా ఏ సాహిత్య ప్రక్రియలో ఎటువంటి రచనలు చేసిన ఆ రచనలతో పాటు అటు పండితుల ప్రశంసలతో పాటుగా ఇటు ప్రజల గౌరవాభిమానులను అందుకున్నారు. ఆయన అందించిన ప్రతీ రచన ఏదో ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఆలక్ష్యసాధన దృష్టితో రచనలు కొనసాగించారు. జాతీయభావం, సమానత్వం, సర్వ మానవ సౌభ్రాతృత్వం సర్వమత సమ భావనలతో పాటుగా సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా మహిళా అభ్యుదయాన్ని, ప్రజా చైతన్యాన్ని ఆకాంక్షిస్తూ రచనలు చేసారు. మత సామరస్యాలను ఆకాంక్షిస్తూ మతం పేరుతో సాగుతున్న దాష్టీకాలను నిరశించారు.

బాల్య వివాహాలను, సతీ సహగమనము, కన్యాశుల్కం, వరకట్నం లాంటి దురాచాలను తునుమాడాలనుకున్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. స్త్రీ విద్య కోసం, స్త్రీ గౌరవం కోసం స్త్రీలు పాటుపడాలని తన గ్రంథంలోని పాత్రల చేత తన అభిమతాన్ని చాలా బలంగా చెప్పారు. ప్రధానంగా ఆయన ప్రతీరచనలో మహిళా పక్షపాతవైఖరి కనిపిస్తుంది. ఆయన రాసిన కళ అను నాటకంలో కుటుంబ జీవితంలో మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలను, నష్టాలను చాలా వివరంగా పేర్కొన్నారు. ఇంటికి ఇల్లాలు గొప్ప సంకల్పంతో కూడిన వెలుగును ప్రసరించే దీపికలంటూ సన్మానించారు. తన పాత్రలతో స్త్రీ స్వాతంత్ర్యం గురించి మాట్లాడిస్తూ లింగబేధంతో పనిలేకుండా అర్హతను, యోగ్యతను బట్టి స్వాతంత్ర్యం ఇవ్వాలెనంటారు. సమాజంలో ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని ఆయన వంచించారు. అయితే నాడు స్త్రీ విద్య మీద విధించబడియున్న ఆంక్షలు ఆయనలో క్రోధాన్ని పెంచాయి. స్త్రీ విద్యను వ్యతిరేకించే వారి పట్ల ఆయన తీవ్ర పదజాలమును ప్రయోగించారు. స్త్రీ విద్యను మాన్పించేవారు సుకురులై పుడతారిన శపించారు. ఈ విధంగా స్త్రీ విద్య ఆటంకం కలిగించే పురుషులను పందులతో పోల్చడం ద్వారా ఆయనకు స్త్రీ విద్య మీదున్న మమకారం, మహిళా విద్యపట్ల వ్యతిరేకత వ్యక్తం చేసే వ్యక్తులంటే ఆయనలో ఆగ్రహం వ్యక్తమౌతుంది.

అదేవిధంగా ఆయన మరో రచన "అనసూయ" అనే నాటకంలో మన వివాహవ్యవస్థ సంసారిక జీవనంలో పడతులు పడుచున్న బాధల గాధలను వివరించే ప్రయత్నం చేస్తూ ఆ నాటకంలో దేవలోకం నుండి భూలోకమునకు విచ్చేసిన "నర్మద" అను పాత్ర ద్వారా భూలోకస్త్రీలు పడుతున్న వేతనలు చూసి విస్తుపోయినట్లుగా మనకు చూపించారు. భర్తకు సేవ చేయడం ద్వారా మాత్రమే భార్యకు స్వర్గం ప్రాప్తిస్తుందన్న ప్రచారాన్ని ఖండిస్తూ స్త్రీ అబల కాదు సబల అని యాచన ద్వారా వచ్చే స్వర్గం తనకు అక్కరలేదని నర్మద పాత్ర ద్వారా చెప్పిస్తారు.

ఈ అనసూయ నాటకాన్ని ఆయన భార్య "చాన్బియాంబ" కోరిక పై 1918లో రాశారు. అంటే సుమారు 80 సం॥ల క్రితం అప్పటి సమాజరీతి రివాజులకు, ఆలోచనలకు వ్యతిరేకంగా స్త్రీ జన పక్షం వహిస్తూ విప్లవాత్మక భావాలను ఉమర్ ఆలీషా ప్రకటించడం విశేషం.

1914లో రాసిన "విచిత్ర బిల్హణీయము" అను నాటకంలో ఆనాటి బాల్య వివాహాలు, కన్యాశుల్కము లాంటి దురాచారాలను ఖండిస్తూ ఆనాటి విపత్కర పరిస్థితుల నుండి స్త్రీ విముక్తి పొందడానికి తీసుకోవలసిన చర్యలను ఈ నాటకములని యామిని పూర్ణతిలక, బిల్హణుడు అను పాత్రల ద్వారా చూపించారు.

అలయాల కంటే బాలికల పాఠశాలలు అవసరమంటారు. సత్రముల కంటే అనాథ శరణాలయములు కావాలంటారు. వనములు, తటాకాలకంటే మహిళలకు సర్వవిద్యలు నేర్పించే కళాశాలలను స్థాపించాలని ఆ పాత్రల ద్వారా ఉమర్ ఆలీషా కోరుకుంటారు.

స్త్రీ విద్య, బాల వైధవ్యము బాధలు కుటుంబ సమస్యల వరకు మాత్రమే ఆయన పరిమితము కాకుండా ఆర్థిక సమస్యల పరిష్కారము కోసం అగ్రహారాలనిచ్చే కంటే 10 మందికి ఉపాధిని కల్పించే యంత్ర కర్మాగారాలను స్థాపించాలంటారు. ఇంకా ఆయన మరిన్ని రచనలు మొల్ల, దానవ వధ, సూఫీ వేదాంత దర్శనము, పద్మావతి నవల, మణిమాల (నాటకము) ఉమర్‌ఖయ్యాము, తత్వ సందేశము, విషాద సౌందర్యము, చంద్రగుప్త, ప్రహ్లాద లేక మహాభారత కౌరవరంగము, నరకుని కాంతాపహరణ, బాగ్దాదు మధువీధి, విశ్వామిత్ర అను ఏకాంకీలు, వరాన్వేన్ అను ప్రవాసనం, ఖంథకావ్యములు, బర్హిణి దేవి, బ్రహ్మ విద్యావిలాసము, మహమ్మద్ రసూల్ వారి చరిత్ర, స్వర్గమాత, హాలీలాంటి పద్య గ్రంధాలు రచించారు. ఈశ్వరుడు, మహమ్మద్ వారి చరిత్ర, సాధన పథము అను గద్యములు, తారామతి, అనునవలలు, ప్రభాత కథావళి అను కథల సంగ్రహము, ఉమర్‌ఖయ్యామ్, ఖురాన్ – ఏ – షరీఫ్, గులిస్తా అను అనువాదాలు, ఇలాజుల్ గుర్బా అను వైద్య గ్రంధాలను ఆయన సృష్టించారు.

ఈ రచనలే కాకుండా వందకు పైగా వ్యాసాలు గల సంపుటి, హిందీ ఉపన్యాసాల సంగ్రహం, ఆంగ్ల ఉపన్యాసాల సంగ్రహం వేర్వేరుగా ఉన్నాయని, ఇవికాక మదాల, మసరాస్ అలీ, ఉరుపుత్తూరు చక్రవర్తి, శ్రీ మద్వాల్మీకి రామాయణము కూడా ఆయన రచించినట్లు డాక్టర్ మహమ్మద్ ముస్తఫా లాంటి పరిశోధకులు పేర్కొంటున్నారు. ఆయన సృష్టించిన సాహిత్య సంపదలో 34 గ్రంథాలు మాత్రమే ప్రస్తుతానికి అందుబాటులో ఉండగా 23 రచనలు ముద్రితమయ్యాయి.

**స్వాతంత్ర్య పోరాటంలో ఉమరాలీషా :**

"తెలుగు ఆధునిక కవి డా॥ఉమర్ ఆలీషా వ్యక్తిత్వము వక్తృత్వం" అను అంశం మీద 1970లో పరిశోధనలు చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు షేక్ మహ్మద్ ఇక్బాల్ వ్యాసకర్తతో మాట్లాడుతూ

ఉమర్ ఆలీషా రాజకీయాలలో నిర్వహించిన పాత్రను వివరించారు. విద్యాభ్యాసం చేస్తున్న సమయములోనే పరాయి పాలన సృష్టిస్తున్న ఇక్కట్లను ఆలీషా గ్రహించారు. బ్రిటీషు పాలకుల చర్యలకు, వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యకాంక్షకు కవిగా స్పందించి తోడ్పాటునందించారు. 1916లో జాతీయ కాంగ్రెసు సభ్యత్వము స్వీకరించారు. ప్రముఖ కవిగా అప్పటికే బహుళ ఖ్యాతి గడించిన ఉమర్ ఆలీషాకు ప్రముఖ జాతీయ నాయకులు శ్రీబిపిన్ చంద్రపాల్, శ్రీ చిత్తరంజన్ దాస్, శ్రీఅరవిందఘోష్‌లతో మంచి స్నేహ సంబంధాలు ఏర్పడినవి. ఈ నాయకుల ప్రభావంతో ఆయన జాతీయోద్యమములో పాల్గొన్నారు. మాతృభూమి పట్ల అపార ప్రేమాభిమానాలు గల మాతృదేశ ఘనతను తన "చంద్రగుప్త" నాటకంలో అలెగ్జాండర్ పాత్ర ద్వారా వివరించారు.

జాతీయ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి పార్టీ పిలుపు మేరకు సాగిన ఉద్యమ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, ఆలీ సోదరులు, మహ్మద్ అన్సారీ లాంటి ప్రముఖులు విజయవాడకు వచ్చినపుడు ఆయనను కలిసి సమకాలిన పరిస్థితుల గురంచి చర్చించి ఉత్తేజితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో స్వాతంత్ర్య సంగ్రామము మీద పరిశోధనలు జరిపిన చరిత్ర ఉపన్యాసకులు డా॥ జి.గోపాలస్వామి (అత్తిలి) వ్యాసకర్తతో మాట్లాడుతూ గోదావరి జిల్లాలలో ఆలీషా సుడిగాలి పర్యటన చేసారని ప్రజలలో దేశభక్తిని, త్యాగాన్ని ప్రోది చేస్తూ ఆయన చేసిన ప్రసంగాలు ప్రజలను చాలా బాగా ప్రభావితం చేసాయి. ఉమర్ ఆలీషా ఆలీపూర్ జైల్లో అరవిందుణ్ణి కలిసి జాతీయోద్యమము గురించి చర్చించారు.

1924లో అఖిల భారత ఖిలాఫత్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా, ముస్లింలీగ్‌కు మద్రాసుశాఖకు ఉపాధ్యక్షునిగా ప్రధాన కార్యదర్శిగా నాయకత్వం వహించారు.

ఉమర్ ఆలీషా వ్యక్తం చేసిన రాజకీయ భావాలను గమనించిన గాంధీజీ, ఉదారమైన రాజకీయ భావాలున్న వ్యక్తిగా ప్రశంసించారని మిస్టర్ ఎమ్.ఎన్.హుండా "బ్రహ్మర్షి డా॥ఉమర్ ఆలీషా తెలుగు పోయట్" వ్యాసంలో పేర్కొన్నారు.

1928 ఉమర్ ఆలీషా తండ్రి శ్రీ మొహియిద్దీన్ బాద్‌షా కన్నుమూయడంతో ఆయన నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక పీఠం బాధ్యతల భారం వల్ల ఖిలాఫత్ ఉద్యమము తరువాత జాతీయ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొలేనప్పటికి క్రియాశీల రాజకీయాలకు మాత్రం దూరము కాలేదు. ఆయన అత్యధిక సమయాన్ని ఆధ్యాత్మిక సేవారంగాలలో గడపాలనుకున్నారు. అందుకే 1930 తరువాత భారత జాతీయ కాంగ్రెసుకు ఉమర్ ఆలీషా రాజీనామా చేసారు. 1935లో అఖిల భారత శాసనసభకు ముస్లింగీల్ అభ్యర్థిగా ఉత్తర మద్రాస్ నియోజక వర్గ రిజర్వ్‌డ్ స్థానం నుండి ఉమర్ ఆలీషా ఎన్నికయ్యారు. భారత శాసనసభలో 10 సం॥ల పాటు ఆయన ప్రజాప్రతినిధిగా బాధ్యతలు సమర్థవంతముగా నిర్వహించిరి.

విశాఖపట్నం జైలులో మహ్మదాలి ఉండగా ముస్లిం ఆంధ్రకవియైన ఉమర్ ఆలీషా గారు విశాఖపట్నంలో సెప్టెంబర్ 18, 1921 తేదీన సముద్రం ఒడ్డున బహిరంగ సభను ఏర్పాటు చేసి, మహ్మదాలీని అభినందిస్తూ తీర్మానం చేసారు. విదేశీ వస్త్రాలను కుప్పలుగా పెట్టి దహనం చేసారు.

**ఉపన్యాసములు :**

విశాఖపట్నం జైలులో మహ్మదాలీ జైలులో ఉండగా ముస్లిం ఆంధ్రకవియైన ఉమర్ ఆలీషా గారు విశాఖపట్నంలో 1921, సెప్టెంబర్ 18వ తేదీన సముద్రపు ఒడ్డున బహిరంగ సభను ఏర్పాటు చేసి మహ్మదాలీని అభినందిస్తూ తీర్మానం చేసినారు. ఈ సభకు పి.సి. వెంకటపతిరాజు గారు విశాఖపట్నం జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు గాను, వసంతరావు, బుజ్జి, సుందరావు గారు, యాకూబ్ హుస్సేన్ సాహెబ్ గార్లు ఈ సభకు అధ్యక్షతవహించినారు. ఈ సభలో ఉమర్ ఆలీషా గారు ఇట్లు ఉపన్యాసించిరి.

ఖిలాఫత్, పంజాబు దురంతాలను గురించి మాట్లాడుతూ ఈ గాయాలు మాన్పుకునేందుకు మనకు తగినంత గడువు లేదు. భగవంతుడే మనకు విజయం చేకూర్చె శక్తి ఇస్తాడని నేను విశ్వశిస్తున్నానని ప్రసంగించారు. వాల్తేరులో మహ్మదాలీ సోదరులను నిర్బంధించడము దైవ ప్రసాదమని నా అభిప్రాయము.

చెరసాలకు పోకుండా అసహాయోద్యమ సిద్ధాంతాలన్నింటిని త్రికరణ శుద్ధిగా నిర్వర్తించిన సంగతి అపరమాత్మునికి తెలుసు నేను ఖిలాఫత్ విషయమై చేసిన కృషి కూడా ఆయనకు తెలియనిది కాదు. ఆలీ సోదరులను జైలులో నిర్బందించుట ప్రభుత్వ తప్పిదమని సభాముఖముగా చెప్పడానికి నేను వెనుకాడనన్నారు.

అల్లర్లుజరిగిన మలబారు ప్రాంతానికి ప్రభుత్వము వారు నన్ను, ఆలీ సోదరులను ఆహ్వానించి పంపియుండినట్లైతే మేము అక్కడకుపోయి వారి కోర్కెలను నెరవేర్చేవాళ్ళము. అలాంటి అవకాశము మాకిస్తే అన్యాయముగా నిరపరాధులు, నిర్దోషులు ఆ అల్లర్లలో మరణించి యుండేవారు కాదు. మాప్లాలు బలవంతంగా హిందువులను మహ్మదీయ మతం స్వీకరించేటట్లు చేసినారని ప్రభుత్వం వారు ప్రకటించినారు అది సత్యం కాదని నా అభిప్రాయమన్నారు. ఇంకా ఆయన ఇల్లరి, పుల్లరి పన్నుల గురించి నూలు వడుకుట గురించి, ఖద్దరు ధరించుట గురించి, మద్యపాన నిషేధం గురించి మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణంగా అహింసావ్రత అవలంభించువలెనని తన ఉపన్యాసంలో ప్రసంగించినారు.

ఈ ప్రసంగం ఆంధ్రలక్ష్మి 1923 సం॥ ఫిబ్రవరి మాసపత్రికలో ప్రచురించబడింది.

ఆయన చేసిన మరిన్ని ప్రసంగాలలో ముఖ్యమైనవి.

(1) ఏలూరు తాలూకా అవసర మహాజన సభలో ఉమర్ ఆలీషా గారీ ప్రసంగం ఆంధ్రపత్రిక 1920 నవంబర్ 17 బుధవారం లో చూడవచ్చు.

(2) ఆది ఆంధ్ర అంటు దోష నివారణ సభ ఆలీషా గారి ఉపన్యాసం
ప్రసంగ సారాంశం ఆంధ్రపత్రికలో 1921 మార్చి 30న ప్రచురించారు.

(3) శ్రీమహ్మద్ వారి వర్ధంతి నాటి ఉపన్యాసము

ఇస్లామ్ ప్రవక్త, మజిలీసే ఇషాఅత్, సీరత్ – మదరాసు 1929 అను పత్రికలో ప్రచురించారు.

**ముగింపు :**

స్పష్టమైన మార్గమును నిర్దేశించుకున్న ఉమర్ ఆలీషా తాను 1945లో అన్ని రకాల వివక్షతలను రూపు మాపేందుకు సంకల్పబద్ధుడైన మరణించే వరకు ఆది రాజకీయమైన, ఆధ్యాత్మిక ప్రభోదమైన సాంఘిక సంస్కరణ అయినా సాహిత్య సంస్కరణ అయినా కడవరకు అంకితభావంతో ఎనలేని కృషి చేసారు.

మానవుడు ప్రశాంత జీవితాన్ని సాగించగలడన్న దృష్టితో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను పీఠం ఆధ్వర్యంలో నిర్వహించడమే కాక భక్తజనులను కూడా ఆ దిశగా చైతన్యవంతులగా చేసి ప్రకృతి సమతుల్యాన్ని కాపాడేందుకు పలు పథకాలను అమలుచేస్తున్నారు. ప్రజల ఆర్థిక స్వావలంబనను మరింతగా పరిపుష్టం చేసేందుకు వివిధ కార్యక్రమాలను చేపట్టి స్వయంగా నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను చైతన్యవంతం చేసి గ్రామీణ భారతం సమగ్రాభివృద్ధికి గత దశాబ్దా కాలంగా పనిచేస్తూ, 2000 సం॥లో ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం 'ఉమర్ ఆలీషా' రూరల్ డవలెప్‌మెంట్ ట్రస్టు అను రిజిష్టర్డ్ సంస్థను ఏర్పాటు చేసి సంక్షేమ – అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పలు ప్రాంతాలలో 50 ఆధ్యాత్మిక – సేవా కేంద్రాలను కూడా స్థాపించి వాటిని ఆయా ప్రాంతాల భక్తజనుల ద్వారా నిర్వహిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా పీఠం ప్రబోధిస్తున్న ధార్మిక సందేశాల పట్ల ఆకర్షితులై అనేకమంది భక్త జనులు దేశ – విదేశాలలో కూడా వ్యాప్తిజేస్తున్నారు. ప్రజలలో జాతి–కుల–మత–లింగ–వర్గ వివక్షతలను రూపుమాపేందుకు, అన్ని సాంఘిక జనసముదాయాలలో పరస్పర సదవగాహన, సద్భావన, మత సామరస్యం మరింతగా పరిఢవిల్లేందుకు నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా నేతృత్వంలో పలు విష్ట కార్యక్రమాలను పీఠం నిర్వహిస్తున్నది.

ఇంత చారిత్రక నేపధ్యం ఉన్న శ్రీ విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం మరియు డా॥ బ్రహ్మశ్రీ ఉమర్ ఆలీషా గారిపై మరిన్ని చారిత్రక పరిశోధనలు జరగాలని నా అభిమతం.

**ఉపయుక్త గ్రంథాలు :**

(1) తూర్పుగోదావరి జిల్లా చరిత్ర

(2) బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా

(3) అంతర్జాలం